క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసన



తిరువూరు: ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పలు వస్తు సేవల ధరలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తిరువూరులో ఆదివారం బోస్ సెంటర్లో ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పేదలపై పెను భారం మోపే విధంగా కేంద్ర ప్రభుత్వం పన్నుల భారం పెంచిందన్నారు. వస్తుసేవలపై కూడా అదనపు పన్నులు విధించడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పెంచిన పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు వెంకటరత్నం, వెంకటేశ్వరరావు, ఆలీబాబా, రవి, భద్రం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

మైలవరం: ఏప్రిల్ 3 నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం తెలిపారు. ఏప్రిల్ 1,2 తేదీలలో బ్యాంకులకు సెలవులు రావడంతో ఏప్రిల్ 3న సొమ్ములు డ్రా చేసి ఐదు రోజుల పాటు పింఛన్లుపంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు స్పందన

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమంపై కరపత్రాల పంపిణీ

ఊటుకూరు(గంపలగూడెం): కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోరుతూ ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలను గంపలగూడెం మండలంలోని ఊటుకూరు, కొణిజెర్ల గ్రామాలలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల సీతారామిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంపదనంతా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు దోచిపెడుతుందని ఆరోపించారు. రైతులకు ఇచ్చే వ్యవసాయ పరికరాల మీద జీఎస్టీని ఎత్తివేయాలని, పెట్రోల్, డీజిల్ గ్యాస్‌పై సుంకాలు తగ్గించాలన్న డిమాండ్లతో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు, కర్షకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. కుటుంబరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు జీ వీరభద్రం, సీఐటీయూ నాయకుడు ఎస్‌జే చారి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

నూజివీడు: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుపై మూడు నెలల శిక్షణ నిర్వహించి ఉపాధి కల్పిస్తారని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆదివారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల్లో శిక్షణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 30 ఏళ్ల లోపు యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 83740 39719, 89785 24022కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ముగిసిన నవమి వేడుకలు

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ కోదండ రామాలయంలో గత నెల 28న ప్రారంభించిన శ్రీరామ నవమి వేడుకలు ఆదివారంతో ముగిశాయి. రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు అనంతరం శ్రీ రాముడు, సీతమ్మ అమ్మవారిని ఊయలలో ఆసీనులు గావించి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డితో పాటు ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- తిరువూరు నియోజవర్గంలో 17 పరీక్ష కేంద్రాలు
- 3,158 మంది విద్యార్థులు



గంపలగూడెం పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

గంపలగూడెం: సోమవారం నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు తిరువూరు నియోజకవర్గంలో ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45గంటల వరకు పరీక్ష సమయం. కాగా విద్యార్థులు ఉదయం 8.45గంటల సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని ఆయా కేంద్రాల అధికారులు తెలిపారు. నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 3,518 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలకు హాజరౌతారని అధికారులు తెలిపారు. వీరిలో 3,108 మంది రెగ్యులర్, 410 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం నాలుగు మండలాల్లో 17 ప్రత్యేక కేంద్రా లను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు సంబంధించి పరీక్ష ప్రశ్న పత్రాలను ఇప్పటికే స్థానిక పోలీస్‌స్టేషన్లలో మొదటి, రెండు సెట్‌లను భద్రపరిచినట్లు రూట్ ఆఫీసర్ బీ సోమశేఖర్‌నాయక్ తెలిపారు.

తిరువూరులో..

తిరువూరు: తిరువూరులో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. సెంట్ ఆన్స్ స్కూల్, విజన్, శ్రీనిధి స్కూళ్లు, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 958 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు కూడా సోమవారం నుంచి ప్రారంభమవుతాయని, గీతమ్స్ స్కూల్, భాష్యం స్కూల్ పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాల్లో జరుగుతాయని పేర్కొన్నారు.

మైలవరంలో..

మైలవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మైలవరం మండలంలో 1,330 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు మండల విద్యాశాఖాధికారి పీ రత్నశ్యామ్‌బాబు తెలిపారు. మండలంలో ఎనిమిది పరీఓ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటిలో నాలుగు కేంద్రాలు ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, మరో నాలుగు కేంద్రాలు ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 80మంది ఇన్విజిలేటర్లు తమ విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 607 మంది 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈఓ పి.రత్నకుమార్ తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఐదు పరీక్ష కేంద్రాలు

విస్సన్నపేట: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విస్సన్నపేటలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ చదల రామకృష్ణ ఆదివారం తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, సెయింట్ థెరిస్సా, సిద్ధార్థ, వికాస్, శ్రీశ్రీ స్కూల్స్‌లో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు 989 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఎంఈఓ పేర్కొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంఈఓ పి.రత్నకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం కలిపి 601 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నారు.

నూజివీడులో..

నూజివీడు: సోమవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు డీవైఈఓ ఎం.సేవియా తెలిపారు. నూజివీడు డివిజన్ నుంచి 3,478 మంది విద్యార్థులు హాజరవుతుండగా వీరికి 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం మవుతాయని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. చాట్రాయి ఆర్‌సీఎం స్కూలు పరీక్ష కేంద్రంలో 257 మంది, జెడ్పీ హైస్కూల్లో 165 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని మర్లపాలెం హైస్కూలు విద్యార్థులు ముసునూరు మండలం చెక్కపల్లి హైస్కూల్లో పరీక్షలు రాయనున్నారని ఆయన పేర్కొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక బస్సులు

తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు వేణు తెలిపారు. తిరువూరు నుంచి ఉదయం ఆరు గంటలకు బయలుదేరి గంపలగూడెం, పెనుగొలను, తునికిపాడు, దుందిరాలపాడు మీదుగా ఊటుకూరు వరకు బస్సువెళుతుందని, పరీక్ష అనంతరం మధ్యాహ్నం 12.45 గంటలకు బయల్దేరి తిరిగి తిరువూరు చేరుతుందని పేర్కొన్నారు. ఏకొండూరు మండలంలో పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం తిరువూరు నుంచి 6.15 గంటలకు బయల్దేరి పోలిశెట్టిపాడు, కృష్ణారావుపాలెం చేరుతుందని, తిరిగి 12.45 గంటలకు విద్యార్థులను గమ్యస్థానాలకు చేరుస్తుందని తెలిపారు. పరీక్ష హాల్ టికెట్ చూపి బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని డీఎం పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షంతో ఇబ్రహీంపట్నం, మూలపాడు సబ్ స్టేషన్ల పరిధిలో ఆదివారం సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సాయంత్రం నాలుగు గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి సబ్‌స్టేషన్లలో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించారు. రాత్రి 7.45 గంటలకు విద్యుత్ పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శిగా రాము

చాట్రాయి: మండలంలోని చాట్రాయి మెయిన్ స్కూల్లో పనిచేస్తున్న జి.రామును ఏలూరు జిల్లా ఎస్టీయూ ఫైనాన్స్ కార్యదర్శిగా యూనియన్ ఆదివారం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా మండల శాఖ నాయకులు ఎ.వెంకటేశ్వరావు, మహబూబ్, జి.అమరయ్య, వి.వెంకటేశ్వరావు అభినందించారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ఉయ్యూరు: కోడిపందేల శిబిరంపై ఎస్ఈబీ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ ఎంఏ ఖదీ ర్ తెలిపిన కథనం మేరకు... పట్టణ శివారు ఎగినపాడు ఖాళీ స్థలాల్లో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్ఈబీ బృందం ఆ ప్రాంతంపై దాడి చేసింది. దాడిలో ఇద్దరు పందెంరాయుళ్లు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రెండు పందెంపుంజులు, మూడు ఫోన్‌లు, రూ 1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి పట్టణ పోలీసులకు అప్పగించారు.

ఘనంగా మట్టల ఆదివారం



తోలుకోడులో మట్టల ఆదివారం పండగలో పాల్గొన్న విశ్వాసులు

మైలవరం: మట్టల ఆదివారం పండగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మైలవరంలోని వివిధ చర్చిలలో క్రైస్తవులు ఈత కొమ్మలకు పూలు గుచ్చి చర్చిల చుట్టూ తిరిగారు. మండలంలోని తోలుకోడు గ్రామంలోని పరిశుద్ధ పౌలు దేవాలయం, సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. తోలుకోడు డీనరీ చైర్మన్ పాల్ విశ్వేశ్వరరావు గురువులు వారి ఆధ్వర్యంలో సంఘస్తులు మట్టలు పట్టుకుని వీధుల్లో తిరిగారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మట్టల ఆదివారం పండగను మండలంలోని ఊటుకూరు, తోటమూలల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తోటమూల ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో రెవ. ఫాదర్ రాజేంద్రప్రసాద్, కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విస్సన్న పేటలో..

విస్సన్నపేట: స్థానిక రెడ్డిగూడెం రోడ్డులో పాస్టర్ భూషణం చర్చి, లూర్దునగర్ ఆర్సీఎం చర్చి ఫాదర్ పాల్, సీఎస్ఐ చర్చి డీనరీ గురువులు కలపాల బాబురావు ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం మట్టలతో పురవీధుల్లో మట్టల ప్రదర్శన నిర్వహించారు.

మల్లేలలో..

మల్లేల(తిరువూరురూరల్): మండలంలోని మల్లేలలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ చర్చి సంఘస్తులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ సంఘాలు, భక్తులు మట్టల ఆదివారం పర్వదినాన్ని ఘ నంగా నిర్వహించారు. జి.కొండూరు సీఎస్ఐ, ఆర్‌సీఎం సంఘాల పెద్దలు భక్తులతో కలిసి ఈతాకు మట్టలకు పూలను అలంకరించి గ్రామంలోని వీధుల్లో తిరిగారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండల పరిధి గ్రామాలు, కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో మట్టల ఆదివారం పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్సీఎం, సీఎస్ఐ, తదితర చర్చీల్లో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కనసానపల్లి పరిశుద్ధ పౌలు సీఎస్ఐ చర్చిలో పాస్టర్ కొల్లూరి ఐజక్‌జాన్ ఆధ్వర్యంలో మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. అడవినెక్కలం సీఎస్ఐ చర్చిలో ఫాదర్ శశిధర్, నరసింగపాలెం, ఈదులగూడెం ఆర్‌సీఎం చర్చిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చాట్రాయి, చనుబండ, కోటపాడు, చిత్తపూరు, సోమవరం, పోలవరం గ్రామాల్లోని ఆర్‌సీఎం, చనుబండ, పోలవరం, సూరంపాలెం, నరశింహరావుపాలెం గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

ముసునూరులో..

ముసునూరు: మట్టల ఆదివారాన్ని మండలంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసుక్రీస్తును సిలువ వేయడానికి ముందు అక్కడి యూదులు ఆయనను గాడిద మీద కూర్చోబెట్టి ఊరేగించే సందర్భంగాన్ని నేటికీ క్రైస్తవులు మట్టల ఆదివారంగా జరుపుకుంటారని చెక్కపల్లిలోని ఎల్ఈఎఫ్ చర్చి పాస్టర్ ఆనంద్ జయ ప్రకాష్ వివరించారు.

డయాలసిస్ కేంద్ర నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే రక్షణనిధి



డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ.కొండూరు: డయాలసిస్ కేంద్ర నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కె రక్షణనిధి అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న డయాలసిస్ కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే రక్షణనిధి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న డయాలసిస్ వ్యాధిగ్రస్తులు దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించి వైద్యం అందజేస్తామన్నారు. ప్రతిపక్ష నాయకులు ఎక్కడో కూర్చుని వారి ఇష్టానుసారంగా మాట్లాడటం సరైనది కాదన్నారు. డయాలసిస్ కేంద్ర నిర్మాణ పనులు జరుగుతున్నాయా.. లేదా అనేది తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఆదివారం అయినప్పటికీ పనులు ఆపకుండా శరవేగంగా చేస్తున్నామని చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, సర్పంచ్ ముచ్చు సీతయ్య, నాయకులు చిమటా రామకృష్ణ పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పెనమలూరు: భార్య అదృశ్యమయిందని భర్త ఫిర్యా దు చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమో దు చేశారు. గోసాల సాయిబాబా కాలువ కట్ట పై భార్యాభర్తలు పంటపల్లి గోవిందు, కుమారి, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. భర్త గోవిందు పెనమలూరులో పలావు హోటల్‌లో వంటమేస్త్రిగా పని చేస్తాడు. అయితే గత రెండు రోజుల క్రితం భార్య కుమారికి విజయనగరం నుంచి ఫోన్ వచ్చింది. ఆమె సోదరి ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో చేరిందని బంధువులు తెలిపారు. కాగా ఈ నెల ఒకటో తేదీన గోవిందు పని ముగించుకుని ఇంటికి వచ్చి చూసేసరికి భార్య ఇంట్లో కనిపించలేదు. విజయనగరం ఫోన్ చేస్తే అక్కడకు రాలేదన్నారు. దీంతో భార్య కనిపించటంలేదని భర్త ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

గంపలగూడెం: పెనుగొలను-గోసవీడు ఆర్అండ్‌బీ రహదారిలో మెట్టగుట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృ తి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వి.సతీష్ కథనం మేరకు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్న కోరుకొండకు చెందిన చిలక కృష్ణ(42) ఘటనలో మృతి చెందాడు. బైకుపై స్వగ్రామం నుంచి గోసవీడు వైపు వెళుతున్న సమయంలో ఘటనా స్థలం వద్ద బైకు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న దిమ్మను ఢీకొన్నాడు. దీంతో గాయాలైన కృష్ణను వెంటనే 108లో తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కృష్ణ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తమ్ముడు అంజియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కృష్ణ మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం.

తిరువూరులో కుక్కల బెడద

తిరువూరు: పట్టణంలోని తంగిళ్లబీడు ప్రాంతంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఆదివారం ఇరువురు బాలురపై కుక్కలు దాడి చేసి గాయపరచడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను, మహిళలను కరిచి గాయపరుస్తున్న వీధికుక్కలను తరలించాలని నగర పంచాయతీ అధికారులను కోరుతున్నా పట్టించుకోవట్లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిపై కేసు

వినగడప(గంపలగూడెం): శ్రీరామనవమి సందర్భంగా వసూలు చేసిన నగదును వడ్డీకి ఇచ్చేందుకు నిర్వహించిన పాట సందర్భంగా ఒక వ్యక్తి మరో వ్యక్తిపై దుర్భాషలాడటంతో పాటు దాడి చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.సతీష్ తెలిపారు. మండలంలోని వినగడపకు చెందిన చిమట ముత్తయ్యపై అదే గ్రామానికి చెందిన పెద్ద వెంకటేశ్వర్లు అలియాస్ సింహాద్రీ ఇష్టానుసారంగా మాట్లాడి దౌర్జన్యం చేసినట్లు ఫిర్యాదు అందింది. దీనిపై సింహాద్రి అతడి కుమారునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోడి పందేలు, పేకాట శిబిరాలపై దాడులు

ముసునూరు: రెండు గ్రామాల్లో జరుగుతున్న కోడి పందేలు, పేకాట శిబిరాలపై ఆదివారం సాయంత్రం వరుస దాడులు చేసి, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. చిల్లబోయినపల్లిలో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.2,590, కోడి పుంజు, చింతలవల్లిలో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.1,500ను సీజ్ చేశారు. మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకుని, రూ.4,090 స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

అంకమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రతాప్



ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నూజివీడు: మండలంలోని రావిచర్లలో వేంచేసి ఉన్న అంకమ్మతల్లిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం దర్శించుకున్నారు. అంకమ్మతల్లికి కొలుపులు కొలుస్తున్న నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకునేందుకు రావిచర్ల వెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లావు నాగవరప్రసాద్, పల్లె రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

మామిడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సీతారామపురంలో తెగులు వచ్చిన మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

ఆగిరిపల్లి: నూజివీడు డివిజన్‌లో అకాల వర్షాల వర్షాలు పడుతున్నందున మామిడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి ఆర్. హేమ అన్నారు. మండలంలోని సీతారామపురంలో ఇటీవల అకాల వర్షాలు కురిసి మామిడికి మంగు తెగులు రావడంతో ఆ మామిడి తోటలను ఆదివారం ఉద్యానశాఖ అధికారి ఆర్.హేమ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. మామిడిలో మంగు తెగులు రాకుండా కార్బండిజం 2.5 గ్రాముల లీటర్ నీటికి లేదా సాఫ్‌ను 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మల్టీకే 10 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సీతారామపురం సర్పంచ్ అత్తి మురళీమోహనరావు పాల్గొన్నారు.

నూజివీడు: ఇటీవల కురిసిన వర్షాలకు మామిడి తోటల్లో రైతులు పలు సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా పిందెలు, కాయలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చని నూజివీడు ఉద్యాన అధికారి ఆర్.హేమ తెలిపారు. నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లోని పలు మామిడి తోటలను ఆదివారం ఆమె పరిశీలించారు.

మంగు తెగులు నివారణకు తగిన చర్యలు

చాట్రాయి: మామిడి పంటకు మంగు నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ద్యానవన శాఖాధికారి హేమ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మామిడి సాగుని ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో మామిడి కాయలకు మంగు సోకుతుందని, దీని నివారణకు 2.5 గ్రాముల కార్బండిజమ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మిరప సాగులో వర్షపు నీరు నిలిచినపుడు మూడు గ్రాముల బ్లాటాక్స్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె సూచించారు.

రాహుల్‌కు సంఘీభావంగా కొవ్వొత్తుల ర్యాలీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయడంపై ఆ పార్టీ కొండపల్లి నాయకులు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ ర్యాలీలో పాల్గొన్నారు. దేశ సంపదను ఆదానీకి దోచిపెట్టడాన్ని ప్రశ్నిస్తే ప్రతిపక్ష పార్టీలపై కేసులు పెట్టడమే కాకుండా రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయడాన్ని ఖండించారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు పాల్గొన్నారు.